క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నివాళి


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన మునిబాలవెంకటకృష్ణమనాయుడు 34వ సంస్మరణ సభ సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన సేవలను ప్రధానోపాధ్యాయుడు రమణయ్య కొనియాడారు. కార్యక్రమంలో ఆయన సతీమణి నరసమ్మ, కుటుంబ సభ్యులు చాముండేశ్వరి, జనార్దన్‌నాయుడు, నాగేశ్వరరావు, మున్నెయ్యనాయుడు, సుబ్బారావునాయుడు, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


పలకలు, పుస్తకాలతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత సంజయ్ రూ. 18 వేల విలువైన పలకలు, పుస్తకాలను వితరణ చేశారు. వాటిని ప్రధానోపాధ్యాయులు రూపేష్ ద్వారా శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. వెనుకబడిన విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అక్షరాల అమరికలు, అందమైన దస్తూరి కోసం సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన పలకలు, పుస్తకాలను అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం కొనియాడారు. ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, వేణుగోపాల్, దాసు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణస్వీకారం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని తంగేళ్లపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) సింగిల్ విండో చైర్మన్‌గా చిన్నకనపర్తి గ్రామానికి చెందిన పోతుగుంట మణినాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. డైరెక్టర్లుగా చిన్న సింగమాల గ్రామానికి చెందిన యత్ర భక్తవత్సలం, కాసారం గ్రామానికి చెందిన ప్రభాకర్ శనివారం ఉదయం 9.30 గంటలకు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

బాలల సంఘాల బలోపేతం


సమావేశమైన బాలలు

శ్రీకాళహస్తి: బాలల సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రగతి సంస్థ నిర్వాహకుడు రామచంద్ర అన్నారు. శ్రీకాళహస్తి మండలం పాపసపల్లి, రామానుజపల్లి, కొత్తూరు, ఎల్లంపల్లి, బీవీపురం గ్రామాల్లో బాలల సంఘం ఏర్పాటు చేసి కొత్త కమిటీలను నియమించారు. ఆయన మాట్లాడుతూ గతంలోలాగే ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశాల్లో బడి ఈడు పిల్లందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బాలల సంఘం పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

వేగంగా దేశమ్మ ఆలయ నిర్మాణ పనులు



నగరి: నేత్ర దేవత దేశమ్మ దేవాలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని నూతనంగా బ్రహ్మాండంగా నిర్మించడానికి మంత్రి ఆర్కేరోజా రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఆలయాన్ని వేగంగా నిర్మిస్తున్నారు. ఆలయ గోపుర పనులను ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు


ఆకట్టుకున్న కేరళ వేషాలు

నారాయణవనం: మండల కేంద్రంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు పుర వీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా పలువురు వేషాలు వేసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కేరళ సంప్రదాయ వేషాలు, డప్పు వాయిద్యాలు అలరించాయి. ఉదయం అర్జున తపస్సు నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సు మాను ఎక్కి పండ్లు, పూలను భక్తులు, మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు తపస్సుమానుకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్తర గోకర్ణ యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీష్ణునికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ఊరేగింపులో శ్రీకృష్ణార్జునులు, కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణ స్వామి


ఆకట్టుకున్న కళా ప్రదర్శన

సబ్సిడీ వివరాలను తెలియజేయాలి


మాట్లాడుతున్న శ్యాంప్రసాద్ రెడ్డి

సత్యవేడు: ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వివిధ రకాల ఎరువులు, విత్తనాలు, పనిముట్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, పండ్లు, పూలతోటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మండలానికి మంజూరైన 5 గోడౌన్ల (గిడ్డంగి)ను మార్కెటింగ్‌శాఖ అధికారులు త్వరితగతిన నిర్మించాలని కోరారు. పశువైద్యశాలకు నూతన భవనం నిర్మించేందుకు మండల అధికారులు చొరవ చూపాలని కోరారు. సంఘాలకే కాకుండా వ్యక్తిగత రైతులకు పనిముట్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రికల్చర్ అధికారిణి రాధ మాట్లాడుతూ.. సబ్సిడీపై ఆంబాకం, సత్యవేడులో ఇద్దరు రైతులకు మినీ ట్రాక్టర్లు అందజేశామన్నారు. పేరడంకు చెందిన రైతుకు పవర్ వీడర్‌ను సరఫరా చేశామన్నారు. మండల పరిధిలో మామిడి తోటలు 1,875 ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్రమణ్యం, ఏఎస్‌ఓ రాఘవరెడ్డి, హెచ్‌ఓ రాధారాణి, వ్యవసాయ అసిస్టెంట్లు మదన్ మోహన్, రుద్రయ్య, వెటర్నటీ అసిస్టెంట్ కుసుమ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం


విద్యార్థులతో హెచ్‌ఎం రూపాదేవి

శ్రీకాళహస్తి: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరమని శ్రీచైతన్య పాఠశాల హెచ్‌ఎం రూపాదేవి తెలిపారు. పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం ఘనంగా ఇన్‌వెస్ట్యూర్ సెరమణి నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ఈ ఎన్నికలు విద్యార్థి స్థాయినుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జీలు కల్పన, జానకి, పీఈటీ మేఘన, ఏవో సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే

- శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు
- 4 మండలాల అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పిచ్చాటూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ–రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ రామారావు సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక రెవెన్యూ కార్యాలయ సమావేశ మందిరంలో పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం, కేవీబీ పురం మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. రికార్డులో ఉన్న పేరు, భూమి ఆధీనంలో ఉన్న పేర్లను సరిచూసుకుని రీ-సర్వే నిర్వహించాలన్నారు. సమస్యలు లేని భూములను మొదట సర్వే పూర్తి చేయాలని, ఆపై సమస్యలు ఉన్న భూముల సర్వే చేపట్టాలని సూచించారు. నోషనల్ ఖాతాలు లేకుండా రెగ్యులర్ ఖాతాల్లోకి మార్పు చేయాలన్నారు. సమస్యలు ఉన్న చోట సామరస్యంగా పరిష్కరించుకుంటూ భూ రీ-సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పిచ్చాటూరు, కేవీబీపురం, నాగలాపురం, నారాయణవనం తహసీల్దార్లు మధుసూదన్ రావు, శ్రీదేవి, ప్రసన్నకుమార్, ప్రమీల, డీటీ వెంకటేశన్, ఆర్ఐలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బిల్వాష్టకం


ప్రత్యేకాలంకారంలో స్వామివారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా బిల్వాష్టకం, నమశ్శివాయ గేయామృత పారాయణం నిర్వహించారు. ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ప్రతిమలను ఏర్పాటు చేసి బిల్వాష్టకం, నమశ్శివాయ గేయామృతపారాయణం చేశారు. సుమారు 80మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి, వాసవీ మహిళా మండలి, వాసవీ సేవకులు, వాసవీ యువసేన పాల్గొన్నారు.

త్వరలో ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు త్వరలో స్వయం ప్రతిపత్తి హోదా లభించనుందని టీటీడీ విద్యాశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీడబ్ల్యూ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. ఇక్కడ ఎంతో మంది విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు అందుకున్నారని తెలిపారు. గత టీటీడీ ఈవో జవహర్ రెడ్డి, ప్రస్తుత ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి సహాయ సహకారాలతో కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. ప్రిన్సిపాల్ మహదేవమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి ప్రతి ఏటా సుమారు 1200 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టాలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీర్ దామోదరం, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మీ, పీఆర్‌వో రవి, అధ్యాపకులు భువనేశ్వరి, ఏవీ లత, ఉమాదేవి, ఉమారాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నా భూమి–నాదేశం శిలాఫలకం ఆవిష్కరణ



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు, చుక్కలనిడిగల్లులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా నాభూమి–నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిబ్బంది, కూలీలు రంగవల్లులు వేసి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల ర్యాలీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం, ఫిజికల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి -నా దేశం నిర్వహించారు. స్వాతంత్య్ర సమర యోధుల సంస్మరణ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను నాటుదాం

మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని సంరక్షిద్దామని చుక్కలనిడిగల్లు సర్పంచ్ కిరణ్ అన్నారు. దేశం అంతటా చేపడుతున్న నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శిలాఫలకం ఆవిష్కరించారు. గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

పిచ్చాటూరు: సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నామినేషన్ పరిశీలన ప్రక్రియ శుక్రవారం పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి ఏవీ సుబ్బారావు తెలిపారు. అడవికొడియంబేడు సర్పంచ్ స్థానానికి 3 నామినేషన్‌లు, గోవర్ధనగిరి 7వ వార్డుకు 4 నామినేషన్‌లు, అడవిశంకరాపురం 1వ వార్డుకు ఒక నామినేషన్ పరిశీలించామన్నారు. అన్నీ నామినేషన్లు నిబంధనల మేరకు ఉండడంతో ఆమోదించినట్లు వెల్లడించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఆపై బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామన్నారు. 19వ తేదీ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏకగ్రీవం కానున్న నాలుగు వార్డులు


బీఎన్‌కండ్రిగలో నామినేషన్ల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి 7వ వార్డుకు కేశవులు, వీఎస్‌పురం 3వ వార్డుకు వెంకటమ్మ, నెరిణికండ్రిగ 6వ వార్డుకు గంగమ్మ, కాటూరు 6వ వార్డుకు మున్నెయ్యల నామినేషన్లు మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం కానున్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాబు తెలిపారు. జీఎన్‌కండ్రిగ 6వ వార్డు ఎస్టీకి రిజర్వు కావడం.. వార్డులో ఎస్టీలు లేకపోవడంతో ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో వాయిదా పడిందన్నారు. నెరిణికండ్రిగ 6వ వార్డుకు గంగమ్మతో పాటు జయమ్మ నామినేషన్ వేశారని.. అయితే జయమ్మ దరఖాస్తులో తప్పులుండడంతో తిరస్కరించినట్లు తెలిపారు. గంగమ్మ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఏఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీవార్మింగ్ డే



శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ సక్సెస్ స్కూల్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

ఏర్పేడు: మండలంలోని సదాశివపురం పొలాల్లో విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ శుక్రవారం మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం..మండలంలోని కందాడు ఎస్సీ కాలనీకి చెందిన తోకల బత్తెయ్య(45) సదాశివపురానికి చెందిన చంద్రరాజు పొలాల్లో వరి కోత పనులకు వెళ్లాడు. పొలంలో పంటను వరికోత యంత్రం కోస్తుండగా పైభాగాన తక్కువ ఎత్తులోని 11 కేవీ విద్యుత్ తీగలను కర్రతో బత్తెయ్య పైకి ఎత్తే యత్నంలో అదుపు తప్పడంతో తలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో బత్తెయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ టిప్పర్లు సీజ్

చిల్లకూరు: మూడు టిప్పర్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకొండ సమీపం ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మూడు టిప్పర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

చిల్లకూరు: వీఆర్వోకు విధినిర్వహణలో ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పున్నపువారిపాళెంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం బీఎల్వో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రమణయ్య అనే వ్యక్తి ఆయన్ని అడ్డగించారు. ఈ విషయమై వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణయ్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ పత్రాలతో భూమి కబ్జా


భూముల రికార్డులు చూపుతున్న రైతులు

తిరుపతి కల్చరల్: నకిలీ పత్రాలు సృష్టించి తమ భూమిని కబ్జా చేయాలని కొందరు చూస్తున్నారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లె రైతులు మోహన్, గోపాలకృష్ణ, సుబ్బయ్య కోరారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమకు తాతముత్తాతల నుంచి అన్నాస్వామిపల్లె గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్లు 341/1లో 3 ఎకరాలు, 341/2లో 1.66 ఎకరాల భూమి వారసత్వంగా వస్తోందన్నారు. తిరుపతి జీవకోనకు చెందిన కొందరు భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆధారాలు తీసుకురమ్మని పోలీసులు చెప్పినా వారు వినకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

వార్డు సభ్యులు ఏకగ్రీవం


నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

నారాయణవనం: మండలంలోని ఇద్దరు వార్డు సభ్యులు మృతి చెందడంతో ఏర్పడిన ఖాళీలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఇద్దరు సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. నారాయణవనం పంచాయతీ 4వ వార్డు, డీకే పాళ్యం 4వ వార్డుకు చివరి రోజు గురువారం రెండేసి నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం పరిశీలనలో ఒక్కో నామినేషన్ చెల్లుబాటు కాకపోవడంతో ఏకగ్రీవమయ్యాయి. నారాయణవనం 4వ వార్డుకు ఏలుమలై, డీకే పాళ్యం 4వ వార్డుకు మహేష్ నామినేషన్లు చెల్లుబాటైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అయ్యింది.

ఐదు నామినేషన్లలో ఒకటి తిరస్కరణ

సత్యవేడు: మండలంలో మూడు వార్డులకు గాను ఐదుగురు వేసి నామినేషన్లలో ఒకటి తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి మణిబాబు తెలిపారు. శుక్రవారం ఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీలు రమణమూర్తి, ప్రకాష్ నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఇరుగుళం 2వ వార్డు(జనరల్)కు బి.వసంత, దాసుకుప్పం మూడో వార్డుకు రమణమ్మ, కృష్ణవేణి వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. మల్లవారిపాళెంతూరు పంచాయతీ ఆరో వార్డు(ఎస్సీ జనరల్) గిరిజ వేసిన నామినేషన్ ఆమోదించగా, ఎం.శేఖర్ వేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. సత్యవేడు మండలంలో మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

విరివిగా రైతులకు పంట రుణాలు


రైతులతో మాట్లాడుతున్న హరనాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని సహకార బ్యాంకు ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలను మంజూరు చేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పీవీకండ్రిగ గ్రామంలో రైతులకు సహకార బ్యాంకు ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. రైతులకు పంట రుణాలతోపాటు యంత్ర పరికరాల కొనుగోలు కోసం రైతు గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో మండల వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్, సీఈఓ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కల్యాణోత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను విజ్ఞానగిరి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

28న యాదవ భవన నిర్మాణానికి భూమి పూజ


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని రామతులసీ కల్యాణ మండపం సమీపంలో యాదవ భవన నిర్మాణానికి 28వ తేదీన భూమి పూజ చేపట్టనున్నట్టు వాసుదేవ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు మునస్వామి యాదవ్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో యాదవ భవన నిర్మాణం, భూమి పూజ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2011లో ఏర్పాటైన వాసుదేవ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏక తాటిపైకి వచ్చారని తెలిపారు. అందరూ కలిసి 150 అంకణాల స్థలంలో యాదవ భవనం నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి బస, కల్యాణ మండపం వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.